కడుపునొప్పి విప్పిచెప్పిన హాస్పిటల్ ప్రహసనం!

# సర్కారు వైద్యం

ఏ.ఏ. సీతారామదాసు

కథ

"ఏమండోయ్! మీ ఫ్రెండు పుల్లారావు గారు కబురుపంపించారు! పాపం రాత్రంతా కడుపు నొప్పట. ఇప్పుడు గవర్నమెంట్ హాస్పిటల్‌కు వెళ్లాలట. ఎలా వెళ్లడమో తెలియదట. మిమ్మల్ని తోడు రమ్మన్నారు'' శ్రీమతి సుప్రభాతం.

''ఎలా వెళ్లడానికే ఏముంది. ఏ సిటీ బస్సుకింద పడ్డా తిన్నగా గవర్నమెంట్ హాస్పిటల్‌కి పోతాడు'' చూపించాను నా తెలివితేటలు.

''చాల్లెండి జోకులు. పాపం ఆయన ఎంత బాధపడుతున్నారో. టిఫిను తయారయ్యింది. త్వరగా స్నానంచేసి, టిఫిను చేసి వెళ్లండి'' భారతనారిలోని జాలికి పరోపకార బుద్ధికీ నిదర్శనం.

ఆలి ఆజ్ఞను అమలుపరిచాడు.

○ ● ○

నేను వెళ్లేసరికి పుల్లారావు మంచంమీద కూచున్నాడు. రాత్రంతా నిద్ర లేకపోవడం వలన మనిషి కొంచెం నలిగినట్లు కనిపించినా ఎక్కువ జబ్బున్నవాడిలా కనిపించడంలేదు! నన్ను చూడగానే చేటంత మొహం చేసుకుని 'రారా, రారా'' అని ఆహ్వానించాడు.

''ఏంట్రా అందరినీ అందరగొట్టేస్తున్నావట. ఏం సంగతి''

''ఏం లేదురా. రాత్రంతా ఒకటే కడుపునొప్పి. భోజనం మామూలుగానే చేశాను. చిరుతిళ్లు తినలేదు. మూడు బరాల్గన్ మాత్రలు వేసుకున్నా, ఆరు సోడాలు తాగినా తగ్గలేదు. తెల్లవార్లూ గిలగిల కొట్టుకున్నాను. ఇప్పుడు కొంచెం సర్దుకున్న దనుకో. ఈ ప్రయివేటు డాక్టర్ల ఫీజులూ,



వాళ్లు రాసిన మందులూ భరించలేంకదా. అందుచేత గవర్నమెంట్ హాస్పిటల్‌కు వెళ దామనుకుంటున్నాను. నాకు కొత్త. నువ్వు సహాయంగా వుంటావని పిలిపించాను'' మ రో ప్రశ్న అడిగే అవసరం లేకుండా అన్ని వివరాలూ ఇచ్చేశాడు.

''సరేలే, తొందరగా తయారవు. క్యూలో ముందుంటాం'' అన్నాను.

వాడు బట్టలు మార్చుకోడానికి లోపలికె ళ్లాడు. ఇంతలో వాడి శ్రీమతి మెల్లగా వచ్చి "అన్నయ్యగారూ, ఒక్కమాట" అన్నది.

"నువ్వు బెంగ పెట్టుకోకు చెల్లెమ్మా. నేను చూపించి తీసుకొస్తాగా"

"మీరొచ్చారు. ఇక నాకు భయంలేదు అన్నయ్యగారూ. కానీ ఒక్క విషయం. ఆయనను అడగడం బాగుండదనుకుంటు న్నాను. ఈ నెల లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియు ం కట్టాలి. కట్టారో లేదో, వెళ్లేది గవర్నమెం ట్ హాస్పిటలు కదా"

"ఛ. ఛ అలాంటివేం పెట్టుకోకు చెల్లెమ్మా. కట్టే వుంటాడులే"

"మరొక్కమాట. ఆ పాలసీ పెళ్లికాక ముందు తీసుకున్నారు. వాళ్లమ్మ పేర రాశారు. మరి ఇప్పుడు నా పేర మార్చారో లేదో"

"మరేం ఫర్వాలేదు. అదీ నేను చూసు కుంటానుగా" ఇంకా ధైర్యం చెబుదామను కుంటుంటే పుల్లారావు వచ్చేశాడు.

ఇద్దరం రోడ్డుమీదికి వచ్చాం. లక్కీగా ఎదురుగా ఖాళీ రిక్షా కనిపించింది.

"ఏయ్ రిక్షా. గవర్నమెంట్ హాస్పిటల్ కు వస్తావా. రానూ పోనూ ఎంతిమ్మన్నావు"

"బాబూ. గవర్నమెంట్ హాస్పిటల్ కు రానూ పోనూ కుదరదు. పోయేందుకు అయిదు రూపాయలు ఇప్పించండి. మీరు తిరిగొచ్చినప్పుడు మాటాడుకుందాం" అ న్నాడు చిరునవ్వు నవ్వుతూ.

ఆ నవ్వులోని వ్యంగ్యాన్ని తెలుసుకోవడా నికి నాకో క్షణం పట్టింది.

రిక్షా ఎక్కికూర్చుని, పోనీయమన్నాను.

○ ● ○

హాస్పిటల్ గేటులోంచి మా రిక్షా పోతుండగా ఎదురుగా బేండ్ మేళంతో ఒక ఊరేగింపులాంటిది కనిపించింది. పాపం ఎవరో పెద్దింటి మనిషి పోయాడులా వుంది అనుకున్నా. కానీ ఆ బాజాలు వేరుగా వుంటాయికదా. రిక్షా అబ్బాయినడిగాను.

"అప్పుడప్పుడు ఈ హాస్పిటల్ నుంచి పూర్తిగా నయమై కొందరు వెళతారు. అలాంటివారిని ఇలా తీసుకెళ్తారు" తన జ్ఞానాన్ని నాకు పంచేడు.

"అంటే మిగతా అందరూ..." నా భయం బయటపడింది.

"ఛ. ఛ. అలాగనుకుంటారేమిటి బా బూ. కొందరు కొంచెం నయమవగానే పోతారు. మరికొంతమంది డాక్టర్ల నర్సింగ్ హోములకు పోతారు. ఇంకొంతమంది బయ టపడితే బాధలతోనేనా బతకవచ్చునని పోతా రు. బెడ్లు అవసరమైతే కొంతమందిని పూర్తిగా బాగుకాకముందే పంపేస్తారు" అ న్నాడు.

నా ప్రాణం కుదుటపడింది.

అవుట్ పేషెంట్ హాలుముందు రిక్షా దిగింది. డబ్బులిచ్చి పంపేశాను.

ఎదురుగా క్యూ. చీటీ రాయించుకోవడా నికి ఒక పాతికమంది వుంటారు. సినిమాహా లుదగ్గరా, కిరసనాయిలు డిపోదగ్గరా వందల మంది క్యూకు అలవాటుపడిన నాకు ఆనం దం కలిగింది. పుల్లారావును ఒకపక్క కూచోపెట్టి, క్యూలో నించున్నాను. పావుగ ంటలో నా వంతు వచ్చింది.

"ఏం జబ్బు" ఉరిమింది. కిటికీ అవతల కూర్చున్న యమభటుని అసిస్టెంట్ లాంటి

ఆకారం.

"నాకేం జబ్బులేదు" అన్నాను. ఆకారాన్ని చూసిన తత్తరపాటుతో...

"అయితే ఇక్కడికి సినిమా టిక్కెట్టు కోసం వచ్చావా?" మరో ఉరుము.

"అబ్బే కాదండీ. మా ఫ్రెండుకు కడుపునొప్పి అందుకని వచ్చాం"

"అయితే అతని వివరాలు చెప్పు. నేను టీ తాగడానికెళ్లాలి"

చెప్పిన వివరాలు ఒక పెద్ద పుస్తకంలో రాసుకుని, నాకొకటి ఇచ్చి, పన్నెండో నెంబరు కిటికీదగ్గరకెళ్లమన్నాడు. వెళ్లాను. అక్కడ క్యూ తక్కువగానే వుంది. రెండు నిమిషాల్లో నావంతు వచ్చింది.

"కుడివైపా, ఎడమవైపా" యమభటుడి అసిస్టెండుకు అన్నయ్యలాగున్న ఆకారం గర్జన.

వివరాలు చెప్పకపోతే మళ్లీ కోప్పడతాడని భయంతో—


"అయ్యా మా ఫ్రెండు పుల్లారావు. తండ్రి చెల్లారావు. పురుషుడు, వయసు 35 సంవత్సరాలు. జీతం 2500. ఎత్తు 5 అడుగుల రెండంగుళాలు. బరువు...." ఏకరవుపెడుతున్నాను.

"అవన్నీ ఎవడడిగాడయ్యా. కడుపునొప్పి కాకపోతే కాలునొప్పికి ఇక్కడకు వస్తారా. బోర్డు చూడలేదూ. ఏవైపు నొప్పి, కుడివైపా, ఎడమవైపా"

"కుడివైపే" తొందరగా చెప్పేశాను. కుడి ఎడమైతే పొరపాటులేదోయ్ అనుకుంటూ.

నా చీటీమీద ఏదో రాసి ఇరవై మూడో నెంబరు రూముకెళ్లమన్నాడు.

పుల్లారావుని తీసుకుని ఆ రూముకెళ్లాము. పేషెంట్లూ, వాళ్లతో వచ్చిన వాళ్లూ బెంచిమీద కూచున్నారు. తెల్ల యూనిఫారం వేసుకున్న అబ్బాయి వచ్చి నా చీటీ చూసి ఒకటోకెను ఇచ్చాడు. పద్దెనిమిదో నెంబరు. ఇప్పుడు ఆరో నెంబరు పేషంట్‌ను చూస్తున్నారట. అంటే ఇంకా గంటైనా పట్టవచ్చు.



ఈ లోపల ట్రీట్‌మెంట్ విషయాలు కనుక్కుందామని ఆ అబ్బాయినా మాటల్లో దింపాను.

"చూడుబాబూ. డాక్టరుగారు పేషెంట్‌ను చూడగానే మందులు రాసిచ్చేస్తారా"

"ఇవ్వరండీ. పరీక్షలు చేయించుకోవాలి. యూరినూ, బ్లడ్డూ, సుగరూ, బీపీ, ఇసిజీ, డిడిటీ, ఎస్‌టిడి, ఓపీక్యూ అన్నీ పరీక్షలు చేయించుకోవాలి"

"మావాడిది అంత పెద్ద జబ్బుకాదు. చిన్న కడుపునొప్పి"

"ఏదైనా తప్పదండీ! ఈ పరీక్షలన్నీ గంజిపేటలోని సుమిత్రా లేబొరేటరీలో చేయించుకుని, రిపోర్టు తెస్తే మందులురాస్తారు"

"ఆ టెస్టులు చేయడానికి మిషన్లూ అవీ ఆసుపత్రిలో వుండవా?"

"వుంటాయి, కానీ పనిచేయవు. చేసినా రీల్సూ, కెమికల్సూ వుండవు. ఉన్నా టెక్నీషియన్లు సెలవులో వుంటారు. వాళ్లు డ్యూటీలో, వున్నా సరైన రిపోర్టు వస్తుందని గ్యారంటీ లేదు"

"పోనీ దగ్గరలో ఎన్నో లేబొరేటరీలు వున్నాయికదా. గంజిపేట అంటే పదిమైళ్ల దూరం"

"అక్కడి రిపోర్టులే కరెక్టుగా వుంటాయి. మరే రిపోర్టూ మా డాక్టరుగారు నమ్మరు"

"ఆ రిపోర్టులు తెస్తే వెంటనే మందులు రాసేస్తారా?"

"రిపోర్టులు చూసి అవసరమైతే హాస్పిటల్లో చేర్చుకుంటారు. తరువాత అవసరమైతే ఆపరేషన్ చేస్తారు"

"హాస్పిటల్లో వెంటనే చేర్చుకుంటారా?"

"బెడ్ ఖాళీగా వుంటే చేర్చుకుంటారు. ముప్పయ్యో నంబరు రూములో అడిగితే బెడ్ ఖాళీగా వున్నదీ లేనిదీ చెబుతారు"

"చేర్చుకున్న వెంటనే అవసరమైతే ఆపరేషను చేస్తారా"

"లేదు. డాక్టరుగారు వారానికొకసారి ప్రతీ శుక్రవారమూ ఆపరేషను చేస్తారు. ఆయన నర్సింగ్‌హోములో ప్రతిరోజూ చేస్తారు. అర్జంటనుకుంటే అక్కడ చేరాలి" అంటూ మరొక పేషంట్ వస్తే టోకెను ఇవ్వడానికెళ్లాడు.

మన టర్ను రావడానికింకా టైముందిక దా. ఈ లోపల బెడ్ విషయం కనుక్కుందామని, పుల్లారావుని అక్కడే కూచోమని ముప్పయ్యో నెంబరు రూమువైపు వెళ్లాను.

తోవలో మా ఆఫీసులో పనిచేసే వెంకటావుగారు కనిపించారు.

"ఏమండోయ్ వెంకటావుగారూ ఏంటిలా వచ్చారు"

"మా ఆవిడను డెలివరీకి చేర్చామండి. ఇప్పుడే ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లారు. టీ తాగొద్దామని బయలుదేరాము"

"అక్కడ ఆపరేషను చేస్తుంటే అక్కడుండకుండా ఇలా తిరుగుతున్నారేంటి?"

"అదే నేను డాక్టర్లతో కష్టాల్లోనూ, సుఖాల్లోనూ ఆవిడను వదలనని పెళ్లినాడు ప్రమాణం చేశాను. అంచేత మీతోపాటు నేనుకూడా ఆ రూములోనే వుంటాను అంటే వాళ్లు ససేమిరా వీల్లేదన్నారు"

"బాగుందండీ, పక్కనే అంటే, ఆ రూములోనా. ఆ గది దగ్గరుంటే, ఏవైనా మందులూ అవీ కావలిస్తే తేవచ్చుకదా"

"సరేలెండి. తొందరగా టీ తాగొస్తాను. లేటైతే ఈ లోపలి ఆపరేషను పూర్తయితే, మొన్న సుబ్బారావుగారిలా నేనూ బాధపడాలి"

"సుబ్బారావు గారికేమయిందండీ"

"వాళ్లావిడని పురిటికి జాయినుచేశారు. అదే టైములో మరో మూడు డెలివరీలు జరిగాయి. పుట్టిన పిల్లలందరినీ ఒకే రూములో తొట్టెల్లో వేశారు. అతను వెళ్లి మా పాపేదీ అంటే, అందరూ ఇప్పుడు పుట్టిన వాళ్లేకదా, ఏదో ఒక పాపను తీసుకోండి అన్నారట"అని తొందరగా గేటువైపెళ్లాడు.

నేను ముప్పయ్యవ నంబరు రూముకెళ్లాము. అక్కడొకాయన పేపరు చదువుతూ కూర్చున్నాడు.

"సార్ మా వాడిని హాస్పిటల్లో చేర్చాలి. ఒక బెడ్‌కావాలి"

"పది రోజులవరకూ ఖాళీలు లేవు. ఇందాకే మినిస్టరుగారి ఫోను వస్తే వారం రోజుల తర్వాత డిశ్చార్జికావలసిన పేషంట్‌ని ఈరోజే డిశ్చార్జి చేసి బెడ్డిచ్చాం" నీకంత ఇన్‌ఫ్లూయన్స్ వుందా అని ఛాలెంజ్.

"మరెలాగండీ. మావాడినెలాగైనా చేర్చాలి" నా అభ్యర్థన.

"మీరు మూడువందలిస్తామన్నా బెడ్ ఖాళీ లేదండీ" నాలుగు వందలిస్తే దొరుకుతుందన్న సూచనా ఇది.

ఇంతలో మొన్న మా ఆఫీసులో పుల్లారావుకు బీసీ కోటాలో ప్రమోషన్ వచ్చిన సంగతి గుర్తొచ్చింది.

"అయ్యా! మా ఫ్రెండ్ బి.సి కాండిడేటండీ. వాళ్లకి 27 శాతం రిజర్వేషన్లుంటాయికదా. ఆ కోటాలో ఖాళీ వుందేమో చూడండి"

"ఆ రూల్సు ఇక్కడ వర్తించవండీ" అంటూ విసురుగా పేపరు పడేసి, బయటకు వెళ్లిపోయాడు. నా యుక్త ప్రశ్నలతో విసిగిపోయినట్టున్నాడు.

సరేలే, వార్డులో అడుగుపెట్టేము. ఒక బెడ్‌చుట్టూ చాలామంది చేరి ఆతృతగా


## గొప్పది

"భార్య గొప్పదా? బ్రాందీ గొప్పదా?" బోసుబాబు అడిగాడు మరో డోసుబాబుని బార్‌లో.

అప్పటికే చాలా రౌండ్లు పూర్తిచేసిన అతను ఇలా చెప్పాడు.

"ఇచ్ఛితంగా బ్రాందీయే గొప్పది! ఎందుకంటే అది తల్లోకి మాత్రమే ఎక్కుతుంది! భార్యలా తలపైకెక్కదు!"

—ఎం.ఆర్.శకుంతల (సికిందరాబాద్)



చూస్తున్నారు. వాలోని స్వార్థం తలెత్తింది. ఈ బెడ్ ఖాళీ అయితే, అవసరమైతే మావాడికి పనికివస్తుందికదా! దగ్గరకెళ్లి అందులో ఒకాయన్ని పక్కకి పిలిచి అడిగాను.

"ఏంబాబూ. ఆ పేషంట్ మీ బంధువా. చాలా సీరియస్‌గా వున్నటుందే! చాలా బాధగా వున్నారు"

"మా బంధువు కాదండీ. ఇతనికి ఇంతకుముందు సీరియస్‌గా వుంటే బెడ్ ఖాళీ అవుతుంది, మావాడిని చేరుద్దామని కాచుక్కూచున్నాం. ఇప్పుడతను తేరుకుంటున్నాడు. అందుకే మా బాధ."

వేనే దానవుడిననుకుంటే వీళ్లవేమవాలి.

మరికొన్ని వార్డులు తిరిగాను. బెడ్‌లు ఖాళీ లేవు. కొందరు కిందనే పడుకున్నారు. ఈలోగా టైమయిపోయిందని పుల్లారావు వద్దకు వచ్చాను.

అప్పుడే అతని టర్న్ వచ్చింది. అతని తోపాటు వేనుకూడా లోపలికెళ్లాను. పుల్లారావుని పడుకోబెట్టి డాక్టరుగారు పరీక్ష చేస్తున్నారు. కళ్లు, వాలుక, పెదవులు, కాళ్లు, చేతులు చూస్తున్నారు. కడుపు నొప్పి అయితే ఇవన్నీ ఎందుకో చూడడం అనిపించింది. ఎంతయినా మన అజ్ఞానం మనదేకదా.

డాక్టరుగారు పరీక్షల లిస్టిచ్చి ఎక్కడ చేయించాలో చెప్పారు. రెండు రకాల మాత్రలూ, ఇంజక్షనూ రాసేరు. ఇంజక్షను కొనుక్కొచ్చాను. ఇంజక్షనిస్తుంటే పుల్లారావు 'అమ్మా' అని అరిచాడు.

"కొంచెం జాగ్రత్తగా ఇవ్వండి సిస్టర్. అసలే మావాడికి భయం"

"మాకు తెలుసండీ. జాగ్రత్తగా ఇవ్వక ఆయన చేతిలో సూది విరిచేస్తే దాని ఖరీదు మా జీతంలో కట్ చేస్తారు. మొన్న అలాగే జరిగింది"

"మరి ఆ సూది అలాగే వుండిపోయిందా?"

"ఎందుకుండిపోతుందీ. అరవిందా వర్సింగ్ హోమ్‌లో చేరి, ఆరు వందలు ఖర్చుపెట్టి తీయించుకున్నాడు. లేకపోతే చచ్చిపోడూ" మాటాడుతూనే ఇంజక్షనిచ్చి, పుల్లారావు చేతిలో దూదిపెట్టి వెళ్లిపోయింది దాన్ని ఏం చేయాలో చెప్పకుండానే.

బయటకొచ్చాం. మందులు కొన్నాం. మర్నాడుదయాన్నే టెస్టులకెళ్లాలని నిశ్చయించుకున్నాం. తోవలో హాస్పిటల్లోని ముచ్చట్లన్నీ పుల్లారావుకి చెప్పాను.

○ ● ○

మర్నాడు ఉదయాన్నే ఆరు గంటలకు పుల్లారావింటికెళ్లాను. ముసుగేసుకుని పడుకున్నాడు.

"లేరా పరీక్షలకెళ్లాలికదా" అంటూ లేపాను.

"ఏం పరీక్షలు రా"

"యూరినూ, బ్లడ్డూ వగైరా"

"ఎవరికిరా"

"నీకే"

"నాకెందుకురా"

"నీకు కడుపునొప్పి వచ్చిందికదరా"

"నాకు కడుపునొప్పి ఎప్పుడు వచ్చిందిరా"

"నేను ఆశ్చర్యంగా చూస్తూ నిలబడ్డాను. వాళ్లావిడ కాఫీ కప్పుతో వచ్చింది.


"ఆ టెస్టుల లిస్టూ, ఆ ఆసుపత్రిలో పాట్లూ చూసిన తర్వాత, ఆయన కడుపునొ

ప్పి మాయమైపోయిందన్నయ్యగారూ. ఇక ముందే బాధ వచ్చినా నోరు మూసుకుని పడుకుంటాము అని శపథం చేశారు. పాపం, కష్టపడి వచ్చారు. కాఫీ తాగండి'' అంది.

వేరే చేసేదిలేక కాఫీ తాగి ఇంటికి బయలుదేరాము.

నిన్న ఆసుపత్రిలో చూసిన అగచాట్లను గుర్తు తెచ్చుకుంటూ.

(ఇది ఏ వ్యక్తినిగానీ, ఏ సంస్థనుగానీ ఉద్దేశించి వ్రాసినదికాదు. ఇందులోని పాత్రలూ, సన్నివేశాలూ, సంస్థలూ కల్పితాలు. కామెడీని సృష్టించడానికి వ్రాసినవి మాత్రమే. ప్రభుత్వానికీ, ప్రభుత్వ హాస్పిటల్స్ సిబ్బందికీ క్షమాపణలతో — రచయిత)



పురందర్. జమ్మలమడుగు.